
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 11 నవంబరు 2024



కోర్టు భవనానికి భూమి పూజ చేస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే

ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాది గొప్ప చరిత్ర 6లో..

హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే

- కరీంనగర్ లీగల్

క్రీడలతో మానసికోల్లాసం

ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి 6లో..

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్ బాల్ పోటీల విజేత కరీంనగర్ సర్కిల్ - కరీంనగర్ స్పోర్ట్స్

బీమా..అతివకు ధీమా

- స్వయం సహాయ సంఘాల సభ్యులకు తోడ్పాటు
- కొత్తగా ప్రవేశపెట్టిన ప్రభుత్వం

- హుజూరాబాద్ రూరల్ 6లో..

పత్తి రైతులను కష్టాలు వీడడం లేదు. ఇప్పటికే మద్దతు ధర దక్కక ఇబ్బంది పడుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా తేమ శాతంపై నిబంధనలు పెట్టడడంతో నామమాత్రంగా కొనుగోళ్లు సాగుతున్నాయి. జిన్నింగ్ మిల్లుల యజమానులు సోమవారం నుంచి పత్తిని కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని మార్కెట్ అధికారులకు ఆదివారం సాయంత్రం నోటీస్ ఇచ్చారు. అప్పటికే రైతులు సోమవారం మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు వాహనాల్లో నింపారు. ఇప్పుడు కొనుగోళ్లు నిలిపివేయడంతో పత్తి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల నిలిపివేత

సీసీఐ నిబంధనలపై మిల్లర్ల నిరసన

అకస్మాత్తుగా నోటీస్ ఇవ్వడంతో రైతుల ఆందోళన

జమ్మికుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల్లో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మిల్లర్లు మార్కెట్ అధికారులకు ఆదివారం నోటీస్ అందజేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట సీసీఐ కఠిన నిబంధనలు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మిల్లర్లు నోటీసులో తెలిపారు. జమ్మికుంటలో మొత్తం ఏడు జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసింది. ఒక మిల్లుకు కేటాయించిన పత్తి పూర్తిగా వచ్చిన తర్వాతనే మరో మిల్లుకు పత్తి పంపిస్తామని సీసీఐ అధికారులు అంటున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకుంటే తర్వాత మిల్లులకు పత్తి తగ్గుతుందని, అలా చేయడం వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు రాష్ట్ర స్థాయి బంద్ పిలుపు ఇచ్చారు. ఇందులో భాగంగానే జమ్మికుంటలో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోనున్నాయి.



మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలు (ఫైల్)

మార్కెట్‌కు వచ్చేందుకు సిద్ధమైన రైతులు

శని, ఆదివారాలు మార్కెట్ యార్డుకు సాధారణ సెలవు దినాలు కావడంతో సోమవారం పత్తి విక్రయించుకునేందుకు రైతులు సన్నద్ధం అయ్యారు. మిల్లర్లు సాయంత్రం నోటీస్ అందజేయడంతో మార్కెట్ అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమై అడ్తీదారుల ద్వారా రైతులకు సందేశం పంపించినట్లు తెలిసింది.

రైతులు అప్పటికే వాహనాలు అద్దెకు తీసుకుని పత్తి తొక్కి పెట్టుకుని మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. సోమవారం కొనుగోళ్లు నిలిపివేస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతికూల పరిస్థితులతో దిగుబడి లేక రైతులు సతమతమవుతున్నారు. ఇప్పుడు ఆకస్మికంగా కొనుగోళ్లు నిలిపివేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. తొక్కి పెట్టిన పత్తి మసక బారి పోయే అవకాశాలు ఉన్నాయి. కొనుగోళ్లు యథావిధిగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భవిష్యత్తులో బీసీల ఓట్లు కీలకం

రాజ్యాధికారం దిశగా పోరాటం

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



అభివాదం చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో బీసీల ఓట్లు కీలకం కానున్నాయని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తరువాత బీసీల సంఖ్య ఎంతో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా తేలిన తరువాత స్థానిక సంస్థల రిజర్వేషన్లు డిమాండ్ చేస్తామన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీల వాటా దక్కుతుందన్నారు. తమ వాటా 53 శాతం దక్కించుకోవడానికి బీసీలు పోరాటాలు చేస్తున్నారని, అవకాశాలు దొరకక బాధపడుతున్నారని తెలిపారు. బీసీ మహిళలకు సబ్ కోటా లేకపోవడం బాధాకరమన్నారు. త్వరలో ఉత్తర తెలంగాణ సింహ గర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి జాతీయ నాయకత్వాన్ని ఆహ్వానిస్తామని తెలిపారు. బీసీలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీసీల బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి లచ్చన్న, మహిళ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల కవిత, ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, గడప కోటేశ్‌కుమార్, ముంజల రాజేందర్, బీరబోయిన తిరుపతి, జిల్లా నాయకులు వంగ వెంకటేశ్వర్లు, బుర్ర కుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గాజు యుగేందర్, గౌరవ అధ్యక్షుడు జాలూరి రమేశ్, రాష్ట్ర అధికార ప్రతినిధి అతిగం రాజశేఖర్, మహిళ నాయకురాలు ఎస్ లక్ష్మి, స్వరూప, మద్దెర్ల రాకేశ్, పెద్దింటి సత్యనారాయణరాజు, విరల్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అన్యాయాన్ని వివరించడానికే పాదయాత్ర

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



కరీంనగర్‌కు చేరుకున్న పిల్లి సుధాకర్, నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించడానికే పాదయాత్ర చేపట్టినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. పిల్లి సుధాకర్ భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు చేపట్టి పాదయాత్ర ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తాలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మాదిగలను విభజించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేయకుండానే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. మాదిగలు బీజేపీకి మద్దతు తెలిపితే, మాలలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి మాలలు ఎంతో కృషి చేశారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మాలమాదిగలలో ఎవరు ఎక్కువ పొందారో లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం మందకృష్ణ మాదిగ తమతో కలసి పోరాడాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమకు మద్దతు తెలపాలని కోరారు. మాలల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ కార్యదర్శి బైరి రమేశ్, రాష్ట్ర కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్య దర్శి ఆంజనేయులు, జిల్లా మీడియా కన్వీనర్ దామెర సత్యం, మర్రి వెంకటస్వామి, గంట శ్రీనివాస్, మేడి మహేశ్, తేలు విజయ పాల్గొన్నారు.

దళితుల పేరు మీద రాజకీయాలు చేస్తే ఊరుకోం..

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

కరీంనగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళితుల పేరు మీద రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులను అడుగడుగునా మోసం చేసింది బీఆర్‌ఎస్ పార్టీ అని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి శృతి మించి మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. దళితుల గురించి మాట్లాడే హక్కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకుగాని, నాయకులకుగానీ లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి నినాదంతో ఆనాడు గద్దెనెక్కిన కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ మొదటి నుంచి దళితులను మోసం చేస్తూనే వచ్చిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేసి మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దళిత బంధు పథకం తీసుకువచ్చింది బీఆర్‌ఎస్ పార్టేనని, ఆ పథకంలో మొదటి విడత, రెండో విడత అన్న అంశమే లేదన్నారు. ఒకేసారి దళితుల ఖాతాలో డబ్బులు జమ చేస్తానని ప్రగల్భాలు పలికిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు రెండో విడత దళిత బంధు కోసం ఉద్యమాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఉద్యమాలు చేస్తున్నారో చెప్పాలన్నారు. ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి ఎందుకు రెండో విడత దళిత బంధు ఇప్పించలేదన్నారు. దళిత బంధులో అక్రమాలు జరుగుతున్నాయని, ఎమ్మెల్యేలు మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఆనాటి సీఎం కేసీఆర్ అన్న మాటలు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దళితులను బీఆర్‌ఎస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని, కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దళితుల మీద చిత్త శుద్ధి ఉందని తెలి పారు. దళితుల అభ్యున్నతికి, వారి ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా కృషి చేస్తుందని, అలాంటి కాంగ్రెస్ పార్టీ మీద నిందలేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న రాజమల్లయ్య, జిల్లా కన్వీనర్ జీడి రమేష్, హస్తపురం తిరుపతి, సానాది వెంకటేష్, మండల అధ్యక్షుడు సాయిలు, రాములు, మెరుగు సంపత్ పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వొద్దనే

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- మిత్తితో సహా వడ్ల పైసలన్నీ కేంద్రమే ఇస్తోంది
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

శంకరపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వడ్ల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. నెలరోజులైనా వడ్లు కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాక్షన్ ప్లాన్‌కు ఆచరణకు పొంతనే లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఇప్పటికీ ప్రారంభించ లేదన్నారు. వడ్ల పైసలన్నీ మిత్తితో సహా కేంద్రమే చెల్లిస్తుందన్నారు. అయినా వడ్లు కొనివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నొప్పి ఏందని ప్రశ్నించారు. ఈ సీజన్‌లో 50లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున 2,500 కోట్ల బోనస్ చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిందన్నారు. ఇప్పటి వరకు బోనస్ రూపంలో నయా పైసా కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. బోనస్ సంగతి దేవుడెరుగు..? కొనుగోళ్లు లేక విసిగిపోయిన రైతన్నలు ఇప్పటికే 20 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను మిల్లర్లకు అమ్ముకున్నార న్నారు. తాలు, తరుగు పేరుతో క్వింటాల్‌కు 5నుంచి 10కిలోలు నష్టపోతున్నారన్నారు. ఇదేనా రైతు ప్రభుత్వమంటే.. ఇదేనా ఇంది రమ్మ పాలన అంటే... రైతులను అరిగోసపెట్టి దోచుకోవడమేనా కాంగ్రెస్ పాలన అని ప్రశ్నించారు. రుణమాఫీ చేస్తామన్నారని, పూర్తి స్థాయిలో జరగ లేదని, మీ దరిద్రపు పాలన వల్ల కొత్త లోన్లు రాక, బయట అప్పులు పుట్టక రైతులు అరిగోస పడుతున్నారన్నారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కూడా రైతు భరోసా ఇస్తామని ఆశపెట్టి పంగ నామాలు పెట్టారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వడ్లను కొనుగోలు చేసి, బోనస్ చెల్లించాలన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని ప్రజా విజయోత్సవాలు చేసుకుంటారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాత విజయోత్సవాలు జరుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఆలయాలపై వరుస దాడులు జరు గుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మొన్ననే శంషాబాద్ హను మాన్ ఆలయంలో నవగ్రహాలను ధ్వంసం చేశారని, ఈ ఘటన మరవక ముందే శంషాబాద్‌లోనే మళ్లీ గుడిపై దాడి చేశారన్నారు. వరుస సంఘటనలు చూస్తుంటే కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చాక ఆలయాలను ధ్వంసం చేసేందుకు ప్రత్యేక దళాలు ఏమైనా వచ్చాయే మోనని అనుమానం కలుగుతోందన్నారు. దేవాల యాలపై దాడులు చేస్తున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, మండలాధ్యక్షుడు ఏనుగు ల అనిల్, నాయకులు దండు కొంరయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమనేతలపై కక్ష సాధింపు మానుకోవాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి నిరంకుశ విధానాన్ని ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయ ఉద్యమనేతలపై కక్ష సాధింపు ధోరణిని మానుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాదుగుల రాములు, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి డిమాండ్‌చేశారు. 13న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని నగరంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల (పురాతన) ఆవరణలో ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డీఈవో నిరంకుశ విధానాన్ని ప్రశ్నించినందుకు సస్పెండ్ చేస్తూ లీవ్ సెటిల్‌మెంట్ చేయకుండా వేధిస్తున్నారన్నారు. 13న జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



చిన్నారి పిల్లల చిత్రాలు

ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు

కరీంనగర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో ప్రభుత్వ జడ్పీ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించింది. కరీంనగర్ మండలంలోని చెర్లబూత్కూర్, గోపాల్‌పూర్, ప్రియదర్శిని కాలనీ, ఎలబోతారంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా అధికారులు ఎంపిక చేశారు. కేంద్రాలను ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేసింది.ఇటీవల ఆయా కేంద్రాలకు పెయింటింగ్‌లు కూడా పూర్తయ్యాయి. పిల్లలకు పాఠ్యాంశాల్లో భాగంగా ఉండే అటవీ జంతువులు, అంకెలు, నీతి కథల చిత్రాలు, వాతావరణం, మొక్కల సంరక్షణ, వాహనాలు, పూలు, కూరగాయలు ఇంటిశుభ్రత వంటి చిత్రాలతో అంగన్‌వాడీలను తీర్చిదిద్దారు.



ఐసీడీఎస్ పథకాలపై చిత్రాలు

ఉత్సాహంగా సదర్ వేడుక

కరీంనగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యాదవులు సదర్ పండుగను ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. గిద్దె పెరుమాళ్ల ఆలయం నుంచి అలంకరించిన దున్నపోతును కోతి రాంపూర్‌లోని కోతి బొమ్మ వద్దకు ర్యాలీగా తీసుకువచ్చి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సదర్‌ను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. హైదరాబాద్‌కే పరిమితమైన సదర్ పండుగరే రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మెనేని రోహిత్‌రావు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు చర్ల పద్మ యాదవ్, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.





అలంకరించిన దున్నపోతును తీసుకువస్తున్న యువకులు, మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్

మాజీ ఎమ్మెల్యే జ్యోతిదేవికి కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవికి కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ఆమె అభిమానులు కన్నీటివీడ్కోలు పలికారు. ఆమె అంత్యక్రియలు ఆదివారం మెట్‌పల్లిలో ముగిసాయి. అనారోగ్యంతో బెంగుళూర్‌లో మృతి చెందగా ఆమె భౌతికకాయాన్ని మెట్‌పల్లికి శుక్రవారం తీసుకొచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం అశ్రునయనాల మధ్య ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. ధర్మపురి, వేములవాడ, చెన్నూర్, కోరుట్ల ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, వివేక్, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రత్యేక వాహనంలో ఆమె భౌతికకాయాన్ని కొమిరెడ్డి రాములు నివాసం నుంచి పాత బస్టాండ్ వరకు అక్కడి నుంచి వెంకట్రావ్‌పేట గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రానికి తరలించి అంత్యక్రియలను నిర్వహించారు. జ్యోతిదేవి చిన్న కుమారుడు కపిల్ చితికి నిప్పంటించాడు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

చిగురుమామిడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల కిష్టస్వామిగౌడ్(60) అనే గీత కార్మికుడు ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుం డగా ప్రమాదవశాత్తు మోకు జారీ పక్కన ఉన్న ఒర్రెలోని నీటిలో పోయాడు. ఇంటికి రాకపోవడంతో బంధువులు వెళ్లి వెతకగా తాటిచెట్టు సమీపంలో ఉన్న ఒర్రెలోని నీటిలో పడి మృతి చెంది ఉన్నా డు. మృతదేహానికి గాయాలతో పాటు నీటిలో మునిగి శ్వాస ఆడక మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

నోకాస్ట్.. లోకాస్ట్

- విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయిస్తున్న ఉపాధ్యాయుడు
- అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు
- రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న మహేష్ చంద్ర
- సామాజిక కార్యక్రమాలతో గుర్తింపు



విద్యార్థులతో తయారు చేయించిన కొబ్బరిపీసు తీసే యంత్రం

ఆ ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు చెప్పడంతోపాటు వారి లోని ప్రతిభను గుర్తిస్తాడు. వారి సృజనాత్మకతకు తన ఆలోచనలను జోడిస్తాడు. విద్యార్థులకు భారం కాకుండా తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులు తయారు చేయిస్తాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకునేలా ప్రోత్సహిస్తాడు. సామాజిక కార్యక్రమాల్లోనూ తన వంతు సహకారమందిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఇల్లంతకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తరగతిగదిలో పాఠాలు బోధించడంతోపాటు విభిన్నతను చాటుకుంటున్నాడు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఉడుత మహేష్‌చంద్ర. తన 23 సంవత్సరాల సర్వీస్ కాలంలో విద్యార్థులతో 760 ప్రాజెక్టులను తయారు చేయించి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలలో ప్రదర్శింపజేశాడు. నోకాస్ట్, లోకాస్ట్ వస్తువులతో ప్రాజెక్టులను రూపొందించడం ఉపాధ్యాయుడి ప్రత్యేకత.

మహేష్ చంద్ర సూచనలతో పలువురు విద్యార్థులకు గుర్తింపు రావడంతో పాటు ఉపకార వేతనాలు అందుకున్నారు. మహేష్ చంద్ర పనితీరును గుర్తించిన ప్రభుత్వం 2019లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగానూ, 2021లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి సన్మానించింది. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విదేశీ ప్రతినిధుల మన్ననలు పొందాడు.

విద్యార్థులతో రూపొందించిన ఉత్తమ ప్రదర్శనలు

ఇంటర్‌నేషనల్ ఇన్నోవేషన్‌లో విద్యార్థిని ఇన్సిరా చేత 'గణపతి మండపాల వద్ద విద్యుత్‌ను ఆదాచేయడం' అనే అంశంపై ప్రాజెక్టును ప్రదర్శించింది. దీనికి అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి వచ్చింది. జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్‌లో బొప్పెన రాహుల్ అనే విద్యార్థి 'గంగాప్రక్షాళన్' అనే ప్రాజెక్టును ప్రదర్శించాడు. నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రకృతిలో దొరికే ఔషధ గుణాలు కలిగిన మొక్కలపై విపులాత్మకంగా తయారు చేసిన ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. సౌతరన్ ఇండియా సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించిన కొబ్బరి పీచు తీసే యంత్రానికి ట్రోఫీని అందుకున్నారు.

ఢిల్లీలో జరిగిన ఇన్ స్పైర్ మానక్‌లో పండుగు సహస్ర ప్రదర్శించిన 'హెల్పింగ్ హైండ్స్ ఫర్ ఓల్డేజీ' ప్రాజెక్టు పలువురి మన్ననలు అందుకుంది. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు రూపొందించే పోటీల్లో నాలుగు సార్లు విద్యార్థులు ఎంపికయ్యారు.గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అవార్డుల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఇన్నోవేటర్‌గా మహేష్‌చంద్ర అవార్డు అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి వరుసగా ఆరు సార్లు ఎంపికయ్యాడు.

సామాజిక కార్యక్రమాలలోనూ భాగస్వామ్యం

విద్యార్థులతో సైన్స్ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించడమే కాకుండా మహేష్‌చంద్ర సామాజిక కార్యక్రమాల్లోనూ ముందుంటారు. ఏటా విద్యార్థులతో మట్టి గణపతులు చేయించి ఇంటింటా పంపిణీ చేస్తారు. నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతారు. తిరిగి పాఠశాలలో చేర్పిస్తాడు. చెకుముకి సైన్స్ సంబరాల నిర్వాహకుడిగా వ్యవహరిస్తాడు.

విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంచాలి

వుడుత మహేష్‌చంద్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, ఇల్లంతకుంట



విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంచినప్పుడే వారు ఉత్తమంగా రాణిస్తారు. ఇప్పటి వరకు వివిధ రకాలైన 760 ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించాం. హెల్పింగ్ హైండ్స్, కొబ్బరి పీచు తీసే యంత్రం, వినాయక మండపాలలో విద్యుత్ ఆదా, గంగాప్రక్షాళన్ ప్రాజెక్టులతో గుర్తింపు లభించింది. భవిష్యత్‌లో నోకాస్ట్, లోకాస్ట్ వస్తువులను ప్రాజెక్టులకు వస్తువులుగా వినియోగిస్తాం. జిల్లా విద్య, సైన్ అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతోనే విద్యార్థుల ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నాం. ఈ విషయంతో గ్రామస్థుల ప్రోత్సాహం మరువలేనిది.

ఐదు నిమిషాల్లో ఇంటికి చేరేలోపే.. మృత్యుఒడికి

- రిసెప్షన్‌కు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- పెళ్లికూతురు సోదరుడు, స్నేహితురాలు దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- జగిత్యాలలో పెళ్లింట విషాదం



సంకీర్త్ (ఫైల్)



మునిరాజి(ఫైల్)

జగిత్యాలరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరో అయిదు నిమిషాల్లో వారంతా ఇంటికి చేరేలోపే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అప్పటివరకు ఆనందంగా, ఉత్సాహంగా పెళ్లివేడుకలు జరుపుకున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలుముకుంది. జగిత్యాల- కరీంనగర్ ప్రధాన రహదారిపై జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు, కారు ఎదురురెదురుగా ఢీకొనడంతో కారు నడుపుతున్న జగిత్యాల పట్టణంలోని హన్‌మాన్‌వాడకు చెందిన సంకీర్త్ (32), పక్క సీటులో ముందుభాగంలో కూర్చున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతికి చెందిన మునిరాజి(28) అనే యువతి సంఘటన స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో వెనక సీట్లో కూర్చున్న రాజమల్లు, ఆయన భార్య లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. పెళ్లికూతురు, పెళ్లికొడుకు ప్రయాణిస్తున్న కారు వీరి కంటే ముందు వెళ్లిపోయింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని హన్‌మాన్‌వాడకు చెందిన దంపతులు రాజమల్లు, లక్ష్మి కూతురు సంఘవి వివాహం ఈనెల 8వ తేదీన వరంగల్‌లో జరిగింది. జనగామలో శనివారం రిసెప్షన్ ఉండడంతో రాజమల్లు ఆయన భార్య లక్ష్మి, కుమారుడు సంకీర్త్‌తో పాటు పెళ్లి కూతురు స్నేహితురాలు మునిరాజితో కలిసి రిసెప్షన్ వేడుకలకు హాజరై తిరిగి జనగామ నుంచి జగిత్యాలకు నలుగురు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున నాలుగు గంటల ప్రాంతంలో జగిత్యాల మండలం ధరూర్ సమీపంలో జగిత్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జగిత్యాల డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సంకీర్త్, మునిరాజిలు అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. కారులో వెనక కూర్చున్న రాజమల్లు, లక్ష్మికి తీవ్రగాయా లయ్యాయి. వెంటనే వారిని మెరుగైన చికిత్స కోసం క రీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో అతి వేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి మేనమామ మామిడిపెల్లి శ్రీనివాస్ ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- పెళ్లికి తిరుపతి నుంచి వచ్చి..

హైదరాబాద్‌లో ఒకే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మునిరాజి తన స్నేహితురాలు సంఘవి వివాహవేడుక లకు హాజరవ్వడానికి తిరుపతి నుంచి వచ్చింది. వరంగల్, జనగామలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై తిరిగి పెళ్లికూతురు స్వగ్రామం జగిత్యాల తిరిగి వస్తుండగా ధరూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మునిరాజి మృతి చెం దింది. దీంతో మునిరాజి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. స్నేహితు రాలు పెళ్లికి హాజరై రోడ్డుప్రమాదంలో మరణించడంతో కుటుంబసభ్యులు రోదలను మిన్నంటాయి.

- రిసెప్షన్ వేడుకలు ముగించుకొని వస్తుండగా ..

జనగామ జిల్లాలో జరిగిన రిసెప్షన్ వేడుకలకు హాజరై జనగామ నుంచి రాజమల్లు కుటుంబసభ్యులు జగిత్యాలకు రెండుకార్లలో బయలుదేరారు. ఒక కారులో వధూవరులు, మరోకారులో రాయమల్లు ఆయన భార్య లక్ష్మితో పాటు కుమారుడు సంకీర్త్, మరో యువతి ము నిరాజితో కలిసి జగిత్యాలకు వస్తున్నారు. ధరూర్ వద్దకు రాగానే వధూవరులు ప్రయాణిస్తున్న కారు ముందువెళ్లి వెనుకాల వస్తున్న కారుకు ప్రమాదానికి గురైంది.

- నిద్రమత్తు.. అతివేగమా కారణమా ..

ధరూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి అతివేగమా.. నిద్రమత్తు కారణమా అని సంఘటన స్థలంలో పలువురు చర్చించుకోవటం కనిపించింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో అతివేగమే కారణమని భావిస్తున్నారు. ఆర్టీసీ బస్సు టైర్ సైతం ఊడిపోవడంతో టైర్ ప్రమాదానికి ముందు ఊడిందా, ప్రమాదం జరిగిన తర్వాత ఊడిందా అనే అంశంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి కారణాలు మాత్రం పోలీసుల విచారణ లోనే తేలాల్సి ఉంది.

ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలి

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాది గొప్ప చరిత్ర
- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే



పూజలు నిర్వహిస్తున్న సీజే అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు, జిల్లా జడ్జి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీజె అలోక్ అరాధే

కరీంనగర్ లీగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్యూడిషియరీలో నూతనంగా వచ్చిన ఆధునిక టెక్నాలజీని అందరూ ఉపయోగించుకోవాలని, అప్పుడే సత్ఫలితాలు వస్తాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే అన్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాల సముదాయానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సీతారాంపూర్ రోడ్డులో న్యాయమూర్తుల నూతన నివాస భవన నిర్మాణాలకు హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా జడ్జి బి ప్రతిమ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొప్ప చరిత్ర కలిగి ఉందని, ఈ జిల్లాలో నూతన భవనాలకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కరీంనగర్ జిల్లా నుంచి తీస్తున్న బండను వినియోగిస్తున్నారన్నారు. కేసుల విచారణలో అనవసరపు వాయిదాలను తీసుకోవద్దని సూచించారు. హైకోర్టు జడ్జి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్ర, గుర్తింపు, దేవాలయాల చరిత్ర, పంటలు, జిల్లా నుంచి గుర్తింపు తెచ్చుకున్న వారి వివరాలను తెలిపి అందరినీ ఆశ్చర్యంలో ముంచారు. హైకోర్టు జడ్జీలు జస్టిస్ బి వినోద్ కుమార్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్,జస్టిస్ జై శ్రీనివాస రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు, అనంతరం జిల్లాకు చెందిన హైకోర్టు పూర్వపు జడ్జి జస్టిస్ పి నవీన్‌రావును సన్మానించారు. 50 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న పి గోపాలకృష్ణ, కె మాధవరావు, జి నారాయణరెడ్డి, వి వెంకటేశ్వరరావు, జి హనుమంతరావును చీఫ్ జస్టిస్ సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీ రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, న్యాయమూర్తులు, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్‌ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌లో జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే అండర్-14 బాలికల 22 కేజీల విభా గంలో జాతీయ స్థాయి కరాటే పోటీలకు అక్షర హైస్కూల్ విద్యార్థిపి కమటం అద్వైత ఎంపి కైంది. ఈ మేరకు విద్యార్థినిని ఎమ్మెల్యే ఆదివారం అభినందించారు. ప్రోత్సాహకంగా రెండు వేల నగదును అందజేసినట్లు కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ మినుకుల రాధ తెలిపారు. కరాటే మాస్టర్ రాజు, తల్లిదండ్రులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



రాగిణి, మధుప్రియ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థినులు రాగిణి, మధుప్రియ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. ఈ నెల 2న హుజూరాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి హాకీ పోటీల్లో గెలుపొంది, ఈ నెల 11న నిజామాబాద్‌లో నిర్వహించనున్న 68వ రాష్ట్రస్థాయి అండర్ 17 హాకీ పోటీలకు ఎంపికై పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటాలన్నారు. డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌని కరావు, అజిత, రజితరావు, ఉపాధ్యాయ బృందం, సహచర విద్యార్థులు అభినందించారు.

తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ: తండ్రి మృతి

సుల్తానాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన తండ్రీకొడుకుల మధ్య ఆస్తి తగాదాల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ సంఘటనలో కొడుకు తిరుపతి దాడి చేయడంతో తండ్రి మదునయ్య(71) మృతిచెందాడు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికెన్ సెంటర్లలో కమిషనర్ తనిఖీలు

రాయికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని చికెన్ సెంటర్లను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఆదివారం తనిఖీలు చేశారు. పరిశుభ్రత పాటించని, నిల్వ ఉంచిన చికెన్ అమ్ముతున్న పలు చికెన్ సెంటర్లకు జరిమానా విధించారు. అన్ని చికెన్ సెంటర్ల యాజమానులు పరిశుభ్రత పాటించాలని, ఎలాంటి నిల్వ ఉంచిన చికెన్ అమ్మరాదని, ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల పందాల స్థావరాలపై పోలీసుల దాడులు

గొల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందోళి గ్రామంలో కోళ్ల పందాల స్థావరాలపై ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు చేసి నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారం మేరకు గ్రామ రెవెన్యూ పరిధిలో కోళ్ల పందాలు జరుగుతున్నాయని కోళ్ల పందాల స్థావరాల పై తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో నలుగురు కోళ్ల పందాల రాయుళ్లు పట్టుబడగా, వారి వద్ద రెండు పందెం కోళ్లు, రూ. 6,200 నగదు లభ్యమయ్యాయి. నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోగా, మరికొందరు పందెం రాయుళ్లు సంఘటనా స్థలినుంచి పారిపోయారు. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన పందెం రాయుళ్లను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ నర్సింగరావు, కానిస్టేబుల్ వేణు పాల్గొన్నారు.

బీమా.. అతివకు ధీమా



- స్వయం సహాయ సంఘాల సభ్యులకు తోడ్పాటు
- కొత్తగా ప్రవేశపెట్టిన ప్రభుత్వం

హుజూరాబాద్ రూరల్, నవంబరు 10: స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తోంది. ఆపత్కాలంలో స్వ యం సహాయ సంఘాల సభ్యులకు మేలు చే యాలని నిర్ణయించింది. వారికి ఆర్థిక భరోసా క ల్పించేలా ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రకటిం చింది. ఈ పథకంలో చేరాలంటే గ్రామీణ, మున్సి పాలిటీల పరిధిలోని స్వయం సహాయ సంఘాల్లో సభ్యులై ఉండాలి. వయస్సు 60ఏళ్ల లోపు ఉండాలి.

ప్రమాదంలో మృతి చెందితే..

సంఘంలో సభ్యురాలై ఎవరైనా ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయల బీమా అందజేస్తారు. గతంలో సంఘం తురుపున తీసుకున్న రుణాలను సభ్యుల్లో ఏ ఒక్కరూ చెల్లించుకున్నా మిగతా వారికి కొత్త రుణం రాదు. ఎవరైనా సభ్యులు మృతి చెందితే మిగతా సభ్యులు వాయిదాలు చెల్లించాలని ఆ కుటుంబంపై ఒత్తిడి తెచ్చేవారు. ఇప్పుడు ప్రమాద బీమా నుంచే చెల్లించే వెసులు బాటు ఉంది. వాయిదా డబ్బులు పట్టుకొని మిగతాది ఆ కుటుంబానికి అందజేస్తారు. బకాయిలు లేకుంటే మొత్తం సొమ్ము ఇస్తారు.

సంఘం సభ్యురాలై సాధారణ మరణం పొందితే ఆ కుటుంబానికి రెండు లక్షలరూపాయల బీమా వస్తుంది. బకాయి ఉంటే అవి పట్టుకొని మిగతాది కుటుంబ సభ్యులకు ఇస్తారు. సంఘం సభ్యులకు సురక్ష పథకం కింద ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. సభ్యురాలు చనిపోతే ఆ సమాచారం గ్రామం, పట్టణాల్లోని ఐకేపీ, మెప్మా సిబ్బందికి తెలియజేయాలి. సభ్యురాలి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఆ వివరాలు స్త్రీ నిధి సహాయ మేనేజర్‌కు అక్కడి నుంచి జనరల్ మేనేజర్‌కు వెళ్తాయి. మరణ ధ్రువీకరణ పత్రం, సంఘం సభ్యురాలి వివరాలు సరిగా ఉన్నాయో లేదో? జీఎం పరిశీలించి బీమా సొమ్ము మంజూరు చేస్తారు.

గ్రామీణ ప్రాంత మహిళలకు అవగాహన కరువు

మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో ఉండే మహిళలు కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే మహిళలు స్వయం సహాయ సంఘాల్లో కొనసాగుతున్నారు. పిల్లల చదువుల కోసం, బిడ్డల పెళ్లిళ్ల కోసం, కుటుంబ ఆర్థిక అవసరాల కోసం పొదుపు సంఘాల నుంచి డబ్బులను తీసుకుంటూ తేదీలకు అనుగుణంగా రుణ డబ్బులను వాయిదాల వారీగా చెల్లిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చాలా మంది మహిళలు నిరక్షరాస్యులై ఉండటంతో వారికి ఈ పథకం గురించి పూర్తి స్థాయిలో అవగాహన లేదు. గ్రామాల్లో ఈ పథకంపై ఫ్లెక్సీలను ప్రధాన కూడళ్ల వద్ద విస్తృత ప్రచారం కల్పించాల్సి అవసరం ఉంది.



క్రీడలతో మానసికోల్లాసం

- ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్ బాల్ పోటీలు
- విజేత కరీంనగర్ సర్కిల్



ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ సర్కిల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బాస్కెట్ బాల్ పోటీలలో కరీంనగర్ సర్కిల్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో ఖమ్మంపై విజయం సాధించి ఆతిథ్య జట్టు రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు ఖమ్మం జట్టుపై 44-18 పాయింట్ల తేడాతో గెలుపొంది ఛాంపియన్ ట్రోఫిని చేజిక్కించుకుంది. టేబుల్ టెన్నీస్ టీం ఈవెంట్ విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు మొదటి స్థానం, వరంగల్ జట్టు రెండవ స్థానం, హైదరాబాద్ జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. సింగిల్స్‌లో జిల్లాకు చెందిన డికె లక్ష్మన్ మొదటి స్థానం సాధించాడు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి వరుణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలతో పని ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం.రమేశ్ బాబు, ఎస్ఈ పెద్దపల్లి బి.సుదర్శనం, ఎస్ఈ జగిత్యాల ఇ.సాల్య, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.జగన్నాథ్, ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ మేనేజర్ తిరుపతి, జివి వెంకటేశ్వర్లు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ద్వితీయ స్థానం



హ్యాండ్‌బాల్ పోటీల్లో ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 10: ఈ నెల 8 నుంచి 10 వరకు హుస్నాబాద్ మినీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. గెలుపొందిన టీంకు మంత్రి పొన్నం ప్రభాకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బండారి మనీల, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సౌందర్య, ఆర్గనైజేషన్ టోర్నమెంట్ జి శ్రీను పాల్గొన్నారు. కోచ్, మేనేజర్లుగా జెట్టిపెల్లి అశోక్, భక్తు రాజ్‌కుమార్‌లు వ్యవహ రించారు.ఈ సందర్భంగా పెటా టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, పాష, డీఈవో జనార్దన్‌రావు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వేణుకుమార్‌లు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జోనల్ స్థాయి జిమ్నాస్టిక్, వెయిట్ లిఫ్టింగ్, బేస్‌బాల్, నెట్‌బాల్ ఎంపిక పోటీల తేదీలను జిల్లా స్కూల్స్ అధ్యక్షులు, జిల్లా విద్యాశాఖాధికారి, నిర్వహణ కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్‌లు ప్రకటించారు. 12న ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి అండర్-14, 17 బాల బాలికల జిమ్నాస్టిక్స్, అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బేస్‌బాల్ అండర్-14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో, 18న నెట్‌బాల్ అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలను చొప్పదండి జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్

మానకొండూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సోమవారం నుంచి 10వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌బ జరగనుంది. ఈ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి 14 గురుకుల పాఠశాలలకు చెందిన 1190 మంది క్రీడాకారులు, 100 అధికారులు పాల్గొంటారు. అండర్-17, అండర్-19 విభాగాల్లో తొమ్మిది అంశాలు ఇదే విభాగంలో అథ్లెటిక్స్‌లో 11 అంశాలు, అండర్-14లో గేమ్స్‌లో ఐదు అంశాలు, అథ్లెటిక్స్‌లో ఎనిమిది అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించబడుతాయి. ఈ పాఠశాల జోనల్ మీట్‌కు మూడోసారి ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు


ఫిజికల్ డైరెక్టర్‌తో వాలీబాల్ బాలికల జట్టు

వాలీబాల్ క్రీడలో సత్తా

జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఖని క్రీడాకారులు ప్రతిభ

గోదావరిఖనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్ శిక్షణలో మెళకువలు నేర్చుకుంటూ క్రీడానైపుణ్యాన్ని మెరుగుపరుచు కుంటున్నారు. ప్రభుత్వం మరిన్ని ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తా మంటున్నారు.

కోల్‌సిటీటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వాలీబాల్ క్రీడలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. గోదావరిఖనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి మొదలు జాతీయస్థాయి వరకు ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలందుకుంటున్నారు. రెండు సంవత్సరాలుగా వాలీబాల్ క్రీడలో శిక్షణ తీసుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా రాణిస్తున్నారు. వీరికి ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్ వాలీబాల్ క్రీడలో నైపుణ్యాలు, మెళకువలు నేర్పుతున్నారు. రెండేళ్లలో రెండుసార్లు రాష్ట్రస్థాయిలో, రెండు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల గోదావరిఖనిలో ప్రతి ష్ఠాత్మకంగా అంతర్‌జిల్లాల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వ హించడం కూడా ప్రత్యేకతను సంతరించుకున్నది. దీంతో ఈ ప్రాంతంలో వాలీబాల్ క్రీడపై విద్యార్థులు, క్రీడాకారులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రత్యేక సౌకర్యాలు, ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తామంటున్నారు.


ఫిజికల్ డైరెక్టర్‌తో వాలీబాల్ బాలుర జట్టు

ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయస్థాయిలో..

పల్లె విగ్నేశ్వరి, జడ్పీహెచ్ఎస్, గోదావరిఖని

పలుమార్లు జిల్లా స్థాయిలో, రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాను.. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయిలో కూడా పాల్గొన్నాను. ఈ విద్యాసంవత్సరంలో సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీకి ఎంపికై శిక్షణ తీసుకుంటున్నాను.. నాకు మరింత ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతాను.



వాలీబాల్ క్రీడపై ఆసక్తి..

ఇ.రాజ్‌కుమార్, గోదావరిఖని

వాలీబాల్ క్రీడపై ఆసక్తితో ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక మెళకువలు నేర్చుకున్నాను. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపర్చాను. ఇటీవల జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. మరిన్ని పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తేవాలని ఉంది. అంతర్జాతీయస్థాయిలో రాణించాలన్నది కోరిక.



రెండున్నర దశబ్దాలుగా వాలీబాల్ క్రీడలో శిక్షణ..

కనుకుంట్ల లక్ష్మణ్, ఫిజికల్ డైరెక్టర్ జడ్పీహెచ్ఎస్, గోదావరిఖని

ఇరవై రెండు సంవత్సరాలుగా ఫిజికల్‌డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ప్రత్యేకంగా వాలీబాల్ క్రీడలో ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దాను. వారంతా వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతం నుంచి వాలీబాల్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించేలా క్రీడాకారులను తయారు చేయాలన్నది నా కోరిక.



నేడు ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఉషు పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీలను సోమవారం నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఫండస్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బార విద్యా సాగర్ తెలిపారు. పోటీలను రెండు విభాగాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. తౌలు విభాగంలో, సాను-షౌ విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్సు, చేతి గ్లౌజులతో ఉదయం 10 గంటలకు పాఠశాలకు నేరుగా రావాలని సూచించారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్


పట్టుకున్న మట్టి టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని గుట్ట ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలను రవాణా చేస్తున్నారనే సమాచారంతో అక్కడికి చేరుకుని అడ్డుకున్నామని పేర్కొన్నారు. ఎక్స్‌కావేటర్‌తోపాటు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు, తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రామచంద్రం హెచ్చరించారు.

విప్లవ కోయిలమ్మ రంగవల్లి

- నేడు వేములవాడలో విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం
- రంగవల్లి వర్ధంతి సభ

సిరిసిల్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రంగవల్లి అలియాస్ లలితక్క. తెలంగాణలో విప్లవ కోయిలమ్మగా, సాంస్కృతిక విప్లవ సారధిగా బడుగు బలహీన వర్గాల్లో మనస్సుల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. నిజామాబాద్ జిల్లా వర్నీ మండలం వకీల్‌ఫారంలో 1959 డిసెంబరు 31 ఎస్‌వీఎల్ నర్సింగరావు, గిరిజ దంపతులకు రంగవల్లి జన్మించింది. సీపీఐఎంఎల్, జనశక్తి ఉద్యమంలో పలు జిల్లాలకు కార్యదర్శిగా పనిచేయడంతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కీలకంగా వ్యవహరించింది. 1999 నవంబరు 11న ములుగు జిల్లా జగ్గన్నగూడెంలో ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసింది. రంగవల్లి జ్ఞాపకంగా మిగిలిపోయి నవంబరు 11 నాటికి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేములవాడ నంది కమాన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆమె జ్ఞాపకాలతో రంగవల్లి విజ్ఞాన కేంద్రం రూపు దిద్దుకుంది. సోమవారం విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంతోపాటు వర్ధంతి సభను నిర్వహించనున్నారు. రంగవల్లి తండ్రి నర్సింగరావు బాన్సువాడ ఎమ్మెల్యేగా పనిచేశారు.

రంగవల్లి ఉస్మానియాలో ఎంఏ చదువుతుండగా వేములవాడకు చెందిన జనశక్తి ఉద్యమనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ ఒకరికి ఒకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. వారి కొడుకును తల్లిదండ్రులకు అప్పగించి రంగవల్లి ఉద్యమంవైపు అడుగులు వేశారు. రంగవల్లి ఉద్యమంలో భూస్వాముల దాడులను ఎదుర్కొన్నారు. వందల ఎకరాలను పేదలకు పంచిన సంఘటనలు ఉన్నాయి. 1992 నుంచి 1995 వరకు గుంటూరు జిల్లా జనశక్తి కార్యదర్శి మాలతిగా అనేక కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు సంస్మరణ సభ

వేములవాడ నంది కమాన్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం, రంగవల్లి వర్ధంతి సభను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. విజ్ఞాన కేంద్రాన్ని ప్రముఖ న్యాయవాది లక్ష్మీ దేవిరియాజ్ ప్రారంభిస్తారు. ఎవరో ఒకరు పాటను లత అశోక్ ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, ప్రొఫెసర్ సి.కాశీం, ఆచార్య కట్ట భగవంతరెడ్డి హాజరు కానున్నారు. అరుణోదయ సాంస్కృతిక సంస్థ కార్యదర్శి విమలక్క సభకు అధ్యక్షత వహించనున్నారు.



అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

మంథని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడివీధిలో చల్లా నారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 2 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులతో కలిసి నారాయణ ఇంట్లో తనిఖీ చేయగా 6ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ చేసిన ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈవిషయంలో నారాయణను ప్రశ్నించగా తాను రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన బియ్యాన్ని రాచర్ల రమేష్‌కు లాభాలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మంథని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టపాక గ్రామం వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కెపల్లి గ్రామానికి చెందిన పొయ్యిల గట్టయ్య(50) వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ సమీపంలోని పాలకేంద్రంలో పనిచేస్తున్న గట్టయ్య విధులు నిర్వహించడానికి ద్విచక్ర వాహనంపై పాల కేంద్రానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

కోల్‌సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు సుద్దాల రాంచందర్(56) మృతిచెందాడు. స్థానిక శ్రీనగర్‌కాలనీలో నివాసముండే రాంచందర్ బైక్‌పై వెళుతుండగా బస్టాండ్ వద్ద డీసీఎం వ్యాన్(టీఎస్ 04 యూసీ 9233) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాంచందర్ మృతి చెందాడు. అతడు ఓసీపీ-5లో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాంచందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

దేశ స్థాయిలో కుల గణన జరిగి తీరాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న కుల గణన మాదిరిగానే దేశ వ్యాప్తంగా కుల గణన జరిగితేనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడానే. దేశంలో జన గణన, కుల గణన జరిగితే బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓబీసీ అని చెప్పుకుంటూఓబీసీలకే అన్యాయం చేస్తున్నాడన్నారు. జార్ఖండ్ ప్రచార సభలో కాంగ్రెస్ అగ్రనేత కులం పేరుతో దేశాన్ని చీల్చుతున్నాడని ప్రధాన మంత్రి మోదీ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతదేశంలో విభిన్న మతాలు, జాతులు, వేలాది కులాలు ఉండగా, మతం పేరుతో ప్రధానమంత్రి మోదీ దేశాన్ని చీల్చుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కులాల లెక్కలు తీసినప్పుడు దెబ్బతినని దేశ భద్రత, బీసీ కులాలు తీసినప్పుడే దేశ భద్రత దెబ్బతింటుందా అని ప్రశ్నించారు. ప్రధాన మంత్రి మోదీకి బీసీ అని చెప్పుకునే నైతిక హక్కు లేదన్నారు. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే జనాభా ధామాషా ప్రకారం బీసీలకు వాటా దక్కాలన్నారు. అన్ని వర్గాలకు సమానమైన సంపదలో బీసీలకు ప్రత్యేక వాటా కేటాయించాలన్నారు. గతంలో లోకసభ ఎన్నికల్లో 300 సీట్ల నుంచి ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లకు పడిపోయిందన్నారు. సంపూర్ణ మెజారిటీ రాక సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. బీసీ వ్యతిరేక చర్యల కారణంగానే ఎన్నికల్లో ఫలితాలు ఈ విధంగా వచ్చాయన్నారు. ఇప్పటికైనా బీసీ బిడ్డగా నరేంద్రమోదీ బీసీలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ మతం అంటే మాకు అభిమానమని, కానీ హిందూ మతం కంటే ముఖ్యం బీసీ కులం ప్రధానమన్నారు. బీసీ జాతికి అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.

- పర్శ హన్మండ్లు కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామానికి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు తండ్రి పర్శ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పర్శ హన్మండ్లు ఇంటికి శ్రీనివాస్‌గౌడ్ వచ్చి పరామర్శించారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కులుకచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు వీరబోయిన మల్లేశ్‌యాదవ్, విద్యార్థి విభాగం జాతీయఅధ్యక్షుడు విక్రమ్ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

చందుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామంలో గోంటి ప్రశాంత్ (29) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోంటి ప్రశాంత్ అనే యువకుడు ఆర్థిక ఇబ్బం దులతో ఆదివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి గంభీరావుపేట మండలం సముద్ర లింగంపేట గ్రామానికి చెందిన పూజ అనే యువతితో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగినట్లు తెలిపారు.


గోంటి ప్రశాంత్ (ఫైల్)

ఆలయాల్లో కార్తీక మాస సందడి

- గోదావరి నదిలో దీపాలు వదిలిన మహిళలు
- భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు


వేములవాడలో రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ధర్మపురిలో గోదావరి హారతి నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి వద్ద గోదావరి హారతి తొమ్మిదో రోజు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు గోదావరి మాతకు విశేష పూజలు జరిపి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

- నరసింహుడి సన్నిధిలో ఏఎస్పీ పూజలు

లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని వేములవాడ ఏసీపీ శేషాద్రిరెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు.

ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగే పంచపర్వాల సందర్భంగా లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. వేణుగోపాల స్వామి ఆలయంలో 14న తులసీ కల్యాణం, రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాత్రి మహా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పంచసహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తజనం

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీ వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి భక్తజనం పోటెత్తారు. కార్తీకమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారుగా 50 వేల వరకు భక్తులు రాజన్నను దర్శించుకుని తరించారు. ఉదయాన్నే భక్తులు రాజన్న ఆలయంలోని కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లో భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజ న్న ఆలయం ముందు భాగంలోని రావి చెట్టు ముందు కార్తీక దీపాలను వెలిగించి భక్తులు మొక్కులు చెల్లిం చుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ అధికా రులు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, గజవెల్లి రమేష్‌బాబు, తిరుపతిరావు, వరి నర్సయ్య నరేందర్, రాజేందర్, ఎడ్ల శివసాయి, అశోక్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం కొనసాగుతోంది. ఆదివారం ఈవో వినోద్‌రెడ్డి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహిళలు పెద్దసంఖ్యలో హాజరై పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలో కోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర గోదావరి స్నానాలు ఆచరించిన భక్తులు పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. నాగదేవత విగ్రహం వద్ద ఉసిరి కాలయలపై వత్తులు వెలిగించారు.

సీపీఎం నగర కమిటీ

భగత్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఎం కరీంనగర్ 9వ మహాసభలు ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ముగిసాయి. కరీంనగర్ నగర కమిటీని 11మందితో ఎన్నుకున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి తెలిపారు. నగర మిటీ కార్యదర్శిగా గుడికందుల సత్యం, కమిటీ సభ్యులుగా పున్నం రవి, పుల్లెల మల్లయ్య, రమురళి, రాజమల్లు, కనకరాజు, జగదీష్, వినయ్, అఖిల్‌సింగ్‌ను ఎన్నుకున్నారు.

కార్యవర్గాలు ఎన్నిక

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్-వినాయకనగర్ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన సంఘం సర్వసభ్య సమావేశంలో రెండేళ్ళ కోసం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోనాల నర్సయ్య, సలహాదారుగా వై.ప్రశాంత్‌రావు, అధ్యక్షుడిగా నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.కొమురయ్య, కోశాధికారిగా ఎ.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరోత్తమ్‌రెడ్డి, ఇ.పరంధాములు, ఎస్.రాజశేఖర్, కార్యదర్శులుగా ఆర్.సంపత్ కుమార్, వై.అశోక్, కె.మధు, ఎస్.వేణు, సభ్యులుగా ఎం.భగత్‌సేన్, వి.కల్యాణకృష్ణ, ఎంవి రాజిరెడ్డి, యు.కనకయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు.

●నగరంలోని భగత్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మెంగని వెంకన్న పటేల్ ఎన్నికయ్యారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన సంఘం ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాజిరెడ్డి హాజరయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసాల రాం చంద్రం పటేల్, ఉపాధ్యక్షులుగా మార్కొండ సత్యం, వంగ సుధాకర్, శ్రీగిరి శ్రీనివాస్, కొడారి రవి, కందుల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

నటన శిక్షణా శిబిరం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10: మాడ్రన్ ఆక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలను నాటక, సినిమా, సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్ కళా రంగాల్లో ప్రోత్సహించడానికి సంబంధించిన ఉచిత నటనా శిక్షణా శిబిరం ఆదివారం ఫిలిం భవన్‌లో ఘనంగా ప్రారంభమైంది. శిబిరాన్ని ఎస్‌ఆర్‌ఆర్ ప్రిన్సిపల్ రామకృష్ణ జ్యోతి ప్రకాశనంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాస్క్ చైర్మన్, యాక్టింగ్ కోచ్ అనసూరి భూనాథాచారి పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండవలా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను దివ్యాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం రథంపై రామచంద్రస్వామి సీతాసమేతుడై ఆలయం చుట్టూ విహరిస్తూ కనువిందు చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మేచినేని అశోక్‌రావు, బివి రావు, కోశాధికారి సిరికొండ వేంకటేశం, సంయుక్త కార్యదర్శి ఎం వేంకటరావు, సభ్యులు డాక్టర్ సంజీవరావు, భూపతిరావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు


హాజరైన భక్తులు

సోమవారం ఉదయం మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావర ణాలు, ధ్వజావరోహణతో ఉత్సవాలు ముగియనున్నాయి.

16న మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఈనెల 16న మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి రాములు తెలిపారు. ఆదివవారం స్థానిక రెవెన్యూ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఆత్మీయ సమ్మేళనానికి ఉస్మానియా ప్రొఫెసర్ కాశిం ముఖ్య అతిథిగా హాజరయ్యారని తెలిపారు. మాదిగజాతి భవిష్యత్ కోసం జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని మరింత బలపరిచేందుకు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వర్గీకరణ అమలు కోసం మాదిగ, మాదిగ ఉప కులాల ఉద్యోగుస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపల్లి ఈశ్వరయ్య, వడ్లూరి రాజమల్లు, జిల్లా కన్వీనర్, ఆసంపెల్లి భూమయ్య, పట్టణ అధ్యక్షుడు ఆస్తపురం భూమయ్య జిల్లా నాయకులు నూనె రమేశ్, రామడుగు రవీందర్, అంతడుపుల శ్రీనివాస్, రమంచ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ధర్నాచేస్తే కేసు

-హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్‌లో పోలీసుల అనుమతులు లేకుండా రోడ్లపై ధర్నాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండ్రోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో చేయడం వల్ల ఎంతోమంది సామాన్య ప్రజలు, ఆస్పత్రికి వెళ్లేవారికి ఇబ్బందులు ఎదురుకున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇకనుంచి భారత కొత్త చట్టాల ప్రకారం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు రోడ్లపై నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదాన్నారు. శాంతిభద్రత పరిరక్షణ విషయంలో పోలీసులు తమ విధులు నిర్వర్తిస్తారన్నారు.

వైకుంఠధామంలో మోటారు మరమ్మతు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కరీంనగర్ రూరల్, నవంబర్10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని వైకుంఠధామంలో మోటారుకు అధికారులు మరమ్మతు చేయించారు. రెండు నెలల తరువాత అధికారులు స్పందించారు. రెండు నెలలుగా గ్రామంలోని వైకుంఠదామంలో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతుండగా ఆంధ్రజ్యోతిలో శనివారం 'వైకుంఠదామంలో వసతులు కరువు' వార్త ప్రచురితం అయ్యింది. దీంతో స్పందించిన మండల అధికారులు బోరు మోటారుకు మరమ్మతు చేయించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు ప్రయివేటు వ్యక్తులతో మోటారును బయటకు లాగి మరమ్మతు చేసి నీటి సమస్యను తీర్చారు. దీంతో సమస్యలపై ఎప్పటికప్పుడు వార్త కథనాలను అందిస్తున్న ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఈ మరమ్మతు కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీఓ జగన్‌మోహన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

కరీంనగర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నుండి సీసీఐ, ప్రవేట్ పత్తి కొనుగోళ్ళను నిరవధికంగా నిలిపివేయడంజరిగిందని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ ఎ పురుషోత్తం ఆదివారం తెలిపారు. సీసీఐ వారు ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో మిల్లులను, కఠిన నిబంధనల పేరుతో రైతులను పత్తి ఖరీదులో ఇబ్బందులకు గురి చేస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోళ్ళను నిలిపి వేశారని తెలిపారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో కూడా కొనుగోళ్ళను నిలిపివేయడం జరిగిందని రైతులు సహకరించాలని కోరారు.

గుంతలను పూడ్చిన యూత్ నాయకులు

రామడుగు, నవంబరు 10 : మండలంలోని గోపాల్‌రావుపేటలోని గోపాల్‌రావుపేట-కరీంనగర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఆదివారం నేచర్ యూత్ సభ్యులు పూడ్చారు. వాహనదారులు ప్రమాదాల భారిన పడకుండా ఉండేందుకు గుంతలను పూడ్చినట్లు నేచర్ యూత్ సభ్యులు తెలిపారు.

సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలి

-కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్ళి సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక అధికారులు సూపర్‌వైజర్లు, ఎన్యూమ రేటర్లను ఆదేశించారు. ఆదివారం ఆమె ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేపై వారితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క ఇళ్ళు కూడా విడిచి పెట్టకుండా, ఎక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు, వ్యాపారస్తులు, వారి కుటుంబ సభ్యులు, సుమారు 350 మందికి పైగా దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు.

యోగా గంగోత్రి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగా గంగోత్రి బెంగుళూరు ఫెడరేషన్ వారు కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రదీప్ కుమార్ని జనరల్ సెక్రటరీగా , ఎస్.వి. జె.సీ జూనియర్ కళాశాల గ్రూపు సంస్థల కరస్పాండెంట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ని గౌరవ అధ్యక్షులుగా నియమించారు. కాగా రాష్ట్ర అధ్యక్షునిగా రెవెల్ల రాజిలింగం తదితర నియామకాలు వివిధ జిల్లాల నుండి ఎంపిక చేయడం జరిగిందని సెక్రటరీ ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుండి 20 వరకు జరిగే గ్రంథాలయ వార్షికోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిచాలని తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమటి మత్స్యగిరి, రాష్ట్ర సలహాదారు డాక్టర్ అరుణ కోదాటి, ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కందాడై రామానుజాచార్యుల మృతికి సంతాపం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేధావి, ఉభయ వేదాంత పండితుడు, కందాడై రామానుజాచార్యులు మృతి పట్ల ఆదివారం పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రాష్ట్ర బాధ్యులతో పాటు జిల్లాకు చెందిన శ్రీవైష్ణవ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్యులు, ఆచ్చి యాదగిరి ఆచార్యులు, శేషం వేంకట రమణాచార్యులు, వానమామలై శ్రీనివాసాచార్యులు, మడభూషణి శ్రీనివాసాచార్యులు, డెబ్బట రాజాంమోహన్ తదితరులున్నారు. శ్రీవైష్ణవ సంఘానికి దిక్సూచిగా వ్యవహరించారని, వారి మరణం తీరని లోటని పేర్కొన్నారు. వారి ప్రవచనాలను అందరూ మార్గదర్శనంగా చేసుకోవాలని తెలిపారు.

అచీవర్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోతి రాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు హైదరాబాదులోని బిర్లా సైన్స్ మ్యూజియం, ప్లానిటోరియం ను ఆదివారం సందర్శించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు తెలంగాణ సెక్రటేరియట్ సందర్శించి అధికారులు, మంత్రులు సెక్రటేరియట్ నుండి ఏ విధంగా పరిపాలన చేస్తారో విద్యార్థులకు అవగహన కల్పించారు. తదనంతరం గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన సుధా కార్స్ మ్యూజియంను సందర్శించి వివిధ రకాల కార్ల మోడల్స్ అవి పనిచేసే విధానాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్.పల్లవి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గంగాధర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం నారాయణపూర్‌లో ఆదివారం గ్రామ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పలువురు కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ నియోజకవర్గ సెక్రెటరీ పొత్తూరి సురేష్ మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంస్థ అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజల సేవకు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గజ్జెల సతీష్, చిలుముల రాజయ్య పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఉన్నా వెలగని దీపాలు

-అంధకారంలో బొమ్మకల్ బైపాస్
-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కరీంనగర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్ బైపాస్ వద్ద కొద్ది రోజులుగా సెంట్రల్ లైటింగ్ సిస్టం పని చేయడం లేదు. కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా నగర శివారు నుంచి బొమ్మకల్ గ్రామ శివారు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం విద్యుత్ దీపాలు గత కొద్ది రోజుల నుంచి వెలగడం లేదు. బొమ్మకల్ గ్రామ శివారులో రాత్రి వేళ అంధకారం నెలకొంది.

బొమ్మకల్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసి లైట్లు మాత్రం ఒకటి విడిచి ఒక్కటి మాత్రమే పని చేస్తున్నాయి. తరువాత గోదావరిఖని ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైట్లు కొన్ని వచ్చుకుంటు పోతుండగా, బొమ్మకల్ స్టేజి నుంచి చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల వరకు పూర్తిగా పని చేయడం లేదు. సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు, పలువురు వాహనదారులు కోరుతున్నారు.


బొమ్మకల్ బైపాస్‌లో అంధకారం

'నిరుద్యోగుల కోసమే స్టడీ సర్కిల్'

కరీంనగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో కరీంనగర్‌లో ప్రతిమ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన కార్యాలయంలో ప్రతిమ స్టడీ సర్కిల్‌లో పరీక్షలకు సన్నద్ధమై ఇటీవల ప్రకటించిన డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్, పీఈటీ ఉద్యోగాలు సాధించిన వెంకటేశ్, అభ్యర్థులను వినోద్‌కుమార్ శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమ స్టడి సర్కిల్‌లో ప్రశాంతమైన వాతావరణంలో అన్ని వసతులతో పాటు ఉచితంగా పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు ఈ స్టడీ సర్కిల్‌లో సిద్ధమైన 410 మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, అశోక్, సాయి ప్రశాంత్, సాగర్, అక్షయ్, రమేశ్, రాజు, శ్రీకాంత్, విజయ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'దళితుల జీవితాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెలగాటం'


మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళితబంధు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దళితుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి దళితబంధు పథకంలో రెండో విడత డబ్బులు ఇప్పించడం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం తీసుకువచ్చిన దళితబంధు పథకం సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న కౌశిక్‌రెడ్డి దళితబంధు విషయంలో రాజకీయం చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం తీసుకువస్తామని చెప్పి ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడంలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దళితుల మీద ప్రేమ ఉంటే రెండో విడత దళితబంధు డబ్బులు ఇప్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

'దళితబంధు ఇవ్వకుంటే చావుడప్పు కొడతాం'

జమ్మికుంట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళితబంధు రెండవ విడుత ఇవ్వకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చావు డప్పు కొడతామని దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్‌లో శాంతియుతంగా నిరసన చేపడుతున్న దళితులపై లాఠిచార్జీ చేయడం సరికాదన్నారు. రెండవ విడుత లబ్ధిదారులకు చెందిన 5500మంది బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సదిశ ఆధ్వర్యంలో మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్

చొప్పదండి, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి) సదిశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఆర్నకొండలో మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలోని నాలుగు మంది విద్యార్థులు పరీక్ష రాయగా ప్రతిభ కనబరిచిన 67 మంది విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తారు. కార్యక్రమంలో సదిశ సంస్థ వ్యవస్థాపకుడు గోవర్ధన్‌రెడ్డి, శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత రమేష్ రెడ్డి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న అఖిల్‌తేజ్ అనే విద్యార్థి గణితం ప్రతిభా పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల హెచ్ఎం అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చొప్పదండి మండలం ఆర్నకొండలో సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణితం ప్రతిభ పోటీల్లో రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా అఖిల్ తేజ్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జూనియర్ కాలేజ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితుడికి పరామర్శ

సైదాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన దాసరి గోపాల్‌కు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు ట్రాక్టర్ రోటోవేటర్‌లో పడి నుజ్జునుజ్జు కాగా కాలును పూర్తిగా తొలగించారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆదివారం సైదాపూర్‌లోని వారి ఇంటికి వెళ్లి గోపాల్‌ను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు నెల్లి శ్రీనివాస్ ఉన్నారు.

మాలలు ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలి

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి

మానకొండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాలలు ఐక్యంగా ఉండి భవిష్యత్తులో జరగబోయే పోరాటాలకు సిద్ధం కావాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట్‌స్వామి సూచించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మానకొండూర్‌లో చేపట్టిన రెండో రోజు ఆదివారం చేపట్టిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. పల్లెమీద బస్టాండ్ నుంచి చెరువు కట్ట బస్టాండ్ వరకు పాదయాత్రలో పాల్గొని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షలకు పైగా మాలలు ఉన్నా కొందరు తక్కువగా ఉన్నారని మాట్లాడడం సరికాదన్నారు. మాలల ఐక్యత చాటేందుకు ఇప్పటి వరకు జరిగిన సభలన్నీ విజయవంతం అయ్యాయని అన్నారు. మాల సమస్యలపై నిర్వహించే సభలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాలలపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు సుధాకర్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం అవుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో అందరు ఐక్యంగా కలిసి ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో మాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, మండల అధ్యక్షుడు బొల్లం వెంకట్‌స్వామి, ఉండింటి ఆంజనేయులు, వేల్పుల రాములు, రవి, తడకపల్లి నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వివేక్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జమ్మికుంట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని విస్‌డమ్ జూనియర్ కళాశాలలో 2001-2003 సంవత్సరం సీఈసీ గ్రూప్ పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు దబ్బెట రవీందర్, బండి ప్రభాకర్, మల్లాడి మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు నాంపల్లి రమేష్, సత్యనారాయణరెడ్డి, సతీష్, సురేష్, కిషోర్, రంజీత్‌రెడ్డి, ఆశోక్, సురేందర్, స్రవంతిరెడ్డి, స్వప్న, సునిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి పరామర్శ

వీణవంక నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నివాసంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ పరమర్శించారు. దళిత బంధు ధర్నాలో పోలీసులు అరెస్టు చేయడంతో అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే చికిత్స అనంతరం వీణవంకలోని నివాసనికి చేరుకున్నారు. అనంతరం పలువురు దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యేను పరమర్శించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దళిత బంధు నిదులు వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బహిష్కరణ

ఇల్లందకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన మడిపల్లె సంతోష్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు గ్రామశాఖ అధ్యక్షుడు మూడెత్తుల మల్లేష్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాచపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సంతోష్ కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానంటూ అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా పార్టీకి నష్టం చేసే వాళ్లను బహిష్కరించండని చెప్పగా ఆయన ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లాల్‌మహ్మద్, బెల్లం అయిలయ్య, మోహన్, అక్బర్, రాజు, కుమార్, మొగిలి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రాజేశ్వరి

మానకొండూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఏఈఆర్వో బి రాజేశ్వరి అన్నారు. మండలంలోని అన్నారం, రాఘవాపూర్, లలితాపూర్, పచ్చునూర్ గ్రామాల్లో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహించామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరూ విధిగా ఫాం 6ను నింపి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బీఎల్వోలు ఇంటింటా తిరిగి అర్హులైన వారందరి ఓటరు నమోదు చేయించాలని అన్నారు. మండలంలో ఫాం 6 ద్వారా 119 నూతన ఓటర్లు, ఫాం7లో 18 ఓటర్ల తొలగింపు, ఫాం8లో 20 ఓటర్లలో తప్పొప్పుల సవరణ చేసినట్లు తెలిపారు. ఎలక్షన్ డీటీ రాకేశ్, ఆయా గ్రామాల బీఎల్వోలు ఉన్నారు.

సీపీఐది త్యాగాలు చేసిన చరిత్ర


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

శంకరపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పార్టీ త్యాగాలు చేసిన చరిత్ర అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఆదివారం శంకరపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐ పార్టీ 2025 డిసెంబరు 26 నాటికి 100ఏళ్ల పార్టీ చేరుకుంటుందని ఏడాది పాటు సంస్థాగత నిర్మాణం సభ్యత్వం నమోదు సెమినార్లు, సదస్సులు, సైకిల్ ర్యాలీలు గ్రామగ్రామాన ఎర్రజెండా ఎగరవేస్తామన్నారు. రాష్ట్రప్ర భుత్వం నిరుద్యోగభృతి, వృద్ధులు వికలాంగులకు, వితంతువులకు పించన్ పెంచకపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలనలో చూసిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారం ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో వివిధ శాఖలలో చేసిన అప్పులను ప్రజలకు తెలిసేందుకు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, తాడవేణి రవి, పిట్టల రామస్వామి, పిట్టల తిరుపతి, కోలని తిరుపతి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

చిగురుమామిడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణ తెలంగాణలో వెంటనే అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కేంద్రమంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి భక్తుల చంద్రమౌళి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తమ సామాజిక వర్గానికి అన్ని విధాల అన్యాయం జరుగుతున్నదన్నారు. ఏబీసీడీ వర్గీకరణతో తమ సామాజికవర్గానికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీసీడీ వర్గీకరణపై మాలలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బోనగిరి రవి, బత్తు శంకర్‌బాబు, చందు, కొమురయ్య, బాలు, లక్ష్మీనారాయణ, సంజు, నవీన్, శంకర్, కృష్ణ, స్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ర్యాంకింగ్ ప్రకారం పత్తి కొనుగోలు

చొప్పదండి, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): ర్యాంకింగ్ ప్రకారమే సీసీఐ పత్తి కొనుగోళ్లను చేపడుతుందని చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి ఒకప్రకటనలో తెలిపారు. మండలంలోని రుక్మాపూర్ శివ శివాని కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లను ఎల్1, ఎల్2 ,ఎల్ 3 ర్యాంకింగ్ ప్రకారం కొనుగోళ్లను చేపడుతుందని తెలిపారు. సోమవారం సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోలు చేయరని రైతులు గమనించి పత్తిని మిల్లుకు తీసుకు రావద్దని ఆమె పేర్కొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

రామడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామంలో గట్టు బూత్కూరు వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా వెలిచాల అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు ఎత్తు తగ్గించే పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి ముదిరాజ్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, కొక్కరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వీర్ల నర్సింగరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జక్కుల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎల్లమ్మల కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధీర్, కాడే ప్రభాకర్ తదితరులు ఉన్నారు.